గీ ఇండ్లల్లో ఎట్లుండాలె!

- పట్టాలిచ్చారు.. పాలు పొంగించారు..
- కరెంటు లేదు...తాగునీరు లేదు..
- సౌకర్యాల కల్పన మరిచారు..
- గృహప్రవేశం చేయని లబ్ధిదారులు
- ఇదీ రామకృష్ణాపూర్ 'డబుల్ బెడ్‌రూం' పరిస్థితి



ఆర్‌కేపీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తయినా.. లబ్ధిదారులు ఇంటి పట్టున ఉండడమే గగనంగా మారింది. కనీసం కరెంట్ సరఫరా, మంచినీటి సౌకర్యం, డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్డు ఇలా మౌలిక వసతుల లేమి వెక్కిరిస్తుంటే.. అసలు పట్టాలిచ్చి ఏమి ప్రయోజనం అనే ఆవేదన లబ్ధిదారుల్లో వ్యక్తమవుతోంది.

రామకృష్ణాపూర్ పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ ఏరియాలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాల పంపిణీ ఇటీవలే జరిగింది. అర్హులైన వారికి రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పట్టాలు అందజేశారు. కానీ ఆ ఇళ్లల్లో ఉండటానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సౌకర్యం, మంచినీటి వసతి కూడా ఇప్పటికీ కల్పించలేదు. దీంతో పట్టా తీసుకున్న పేద ప్రజలు ఇళ్లల్లోకి వచ్చి ఉండటానికి అష్టకష్టాలు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ కూడా పూర్తికాలేదు. డబుల బెడ్ రూం ఇళ్లపైన ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులకు పైపులైన్ కనెక్షన్లు కూడా ఇవ్వలేదు. ఇళ్లపైన మొత్తం 30 సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయగా వాటిలో నాలుగైదు మినహా అన్ని ట్యాంకులు డ్యామేజ్ అయ్యాయి. గాలికి ఎగిరి కిందపడి కొన్ని ట్యాంకులు పాడవ్వగా, మరికొన్ని దొంగలపాలయ్యాయి. మొత్తం 26ట్యాంకులు తిరిగి ఏర్పాటు చేయాల్సి ఉందని, దానికి సుమారు రూ.3లక్షల 64 వేల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా కూడా వేశారు. సుమారు 300కిటికీలకు సంబంధించిన అద్దాలు కూడా ధ్వంసమయ్యాయి. దాదాపు 50తలుపులు కూడా ఎత్తుకెళ్లారు. వీటితో పాటు మరికొన్ని ఇళ్లల్లో కింద ఫ్లోరింగ్ దెబ్బతింది. ఇళ్లల్లో నీటి ట్యాపులు, పీవీసీ పైపులు ఇలా అన్నీ కూడా దెబ్బతినడంతో అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు మంజూరైనా, ఇళ్లల్లోకి వచ్చి ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ట్యాంకుల ఏర్పాటు, కిటికీల అద్దాలు, డోర్స్, ఫ్లోరింగ్, పైపులైన్లు ఇలా అన్ని మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.15లక్షల ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. వీటన్నిటితో పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లకు రోడ్డు సౌకర్యం కూడా కల్పించాల్సి ఉంది. కాగా పట్టాలు ఇచ్చి నా.. పాలు పొంగించినా.. తాము వెళ్లి ఇళ్లల్లో ఉండాలంటే కనీస వసతులు తక్షణమే కల్పించాలని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది



డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.కోటి 17లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశాం. ముందుగా లబ్ధిదారులు కరెంట్ మీటరు కోసం అప్‌లై చేసుకోవాలి. దాని కోసం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ట్యాక్సులు కట్టి డోర్ నంబరు తీసుకోవాలి. తర్వాత టీఎస్ఎన్‌పీడీసీఎల్ వారికి కరెంట్ మీటరు కోసం దరఖాస్తు చేసుకోవాలి. డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి పనులు ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షిస్తోంది. వారే పూర్తి చేయాల్సి ఉంది.

– జి.రాజు, మున్సిపల్ కమిషనర్, క్యాతనపల్లి

బెల్లంపల్లి సమస్యల పరిష్కారానికి తోడ్పడండి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కోరారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంగళవారం నరేందర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బెల్లంపల్లిలో ఆర్టీసీ బస్‌డిపో మంజూరు చేయాలని, వందపడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు కావాల్సిన పరికరాలను సమకూర్చాలని, బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించేలా తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తదనంతరం సింగరేణి సీఅండ్ ఎండీ బలరాం నాయక్‌ను కలిసి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



శ్రీజకు అవార్డు, మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ అంజయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మహబూబాద్ జిల్లా కేంద్రంలో ఇటీవల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. అండర్–19 విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాయిని శ్రీజ అత్యంత ప్రతిభ కనబర్చి హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికై నట్లు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం అవార్డు, మెడల్, సర్టిఫికేట్‌ను అందజేసి ప్రశంసించారు. కబడ్డీ పోటీల్లో రాణించిన శ్రీజను ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి డి.బాబురావు, కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి చంద్రయ్య అభినందించారు.

చెత్త తరలింపు వాహనాలు అడ్డగింత

- ట్రాక్టర్లు రాకుండా జేసీబీతో కందకం



తిరిగి వెళ్తున్న చెత్త తరలింపు ట్రాక్టర్

నస్పూర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ డంప్‌యార్డులో చెత్తను డంప్ చేయడాన్ని స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. చెత్త తరలించే వాహనాలను అడ్డుకొని తిరిగి పంపించేశారు. నస్పూర్, మంచిర్యాల, గుడిపేట, పాత మంచిర్యాల, పలు ప్రాంతాల్లోని చెత్తను తీసుకొచ్చి నస్పూర్‌లోని ఆర్కే 5కాలనీ ముక్కిడి పోచమ్మ దేవాలయం పక్కన గల డంప్‌యార్డులో పడేస్తున్నారు. దీంతో డంప్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు అనారోగ్యం భారిన పడుతున్నారు. మంచిర్యాల, గుడిపేట నుంచి వచ్చిన చెత్త తరలింపు వాహనాల్లో మెడికల్ వేస్ట్ ఉండడాన్ని గమనించిన స్థానికులు చెత్త వాహనాలు డంపింగ్‌యార్డుకు రాకుండా ముక్కిడి పోచమ్మ దేవాలయం వద్ద జేసీబీ వాహనంతో కందకం తవ్వారు. దీంతో వాహనాలు వెనుతిరిగి వెళ్లిపోయాయి. నస్పూర్‌లోని డంప్‌యార్డుకు మెడికల్ వేస్ట్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్రికా ముఖంగా తెలిపిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఈ విషయమై స్పందించడం లేదని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా డంప్‌యార్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ని ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బొగ్గుబాయి వార్తలు

శిక్షకులకు ఆహ్వానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి గాను పలు వృత్తి శిక్షణ కోర్సులను నేర్పించడానికి ఆసక్తిగల శిక్షకులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సుల్లో నేర్పించడానికి సింగరేణి ఉద్యోగస్తులు, కుటుంబ సభ్యులు, భూనిర్వాసితుల కుటుంబ సభ్యులలోని మహిళలకు మాత్రమే ఈ అవకాశం కలదన్నారు.

కొత్త క్యాప్ లాంప్‌లు కొనుగోలు చేయాలి

శ్రీరాంపూర్: కొత్త క్యాప్ లాంప్‌లను కొనుగోలు చేయాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్కే 5గనిని మంగళవారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికుల నుంచి సభ్యత్వ రుసుము వసూలు చేశారు. ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ 1గనిలో టీబీజీకేఎస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి యూనియన్ సభ్యత్వం నమోదు చేసి రుసుము వసూలు చేశారు. ఆ యూనియన్ నా యకులు పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, రాజేశం, సముద్రాల అన్వేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి

శ్రీరాంపూర్: కార్మికులు కష్టపడి కంపెనీకి వేల కోట్ల రూపాయల లాభాలను సాధించి పెడుతున్నారని, కావున వారికి దీపావళి పండుగకు స్వీట్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి కోరారు. ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మంగళవారం ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులు కష్టపడితేనే ఈ లాభాలు వచ్చాయన్నారు. గతంలో స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. అనంతరం కార్మికుల నుంచి సభ్యత్వ రుసుము వసూలు చేశారు.

విద్యార్థులు ఉన్నత హోదాలో ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

లక్సెట్టిపేట: విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత హోదాలో ఉండాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కే.సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో కోర్టు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురెడ్డి సత్తన్న, కళాశాల సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు అండర్–17 కబడ్డీ పోటీలు

తాండూర్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మండలంలోని అచ్చలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు, కన్వీనర్ ఉమాదేవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాంబమూర్తి తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలలోపు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాల కోసం 9849234865 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

డీపీవో ఆకస్మిక తనిఖీలు



సెగ్రిగేషన్ షెడ్‌లోని కంపార్ట్‌మెంట్లను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) డి.వెంకటేశ్వర్‌రావు మంగళవారం జిల్లాలోని పలు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. జైపూర్ పలు గ్రామాలను సందర్శించి సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాలు, నర్సరీలను పర్యవేక్షించి సూచనలు చేశారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్‌లలో వేరు చేసి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని, సేకరించిన ప్లాస్టిక్ వస్తువులను విక్రయించి పంచాయతీలో జమ చేయాలని ఆదేశించారు. ఎంపీఓలు శ్రీపతి బాపు, సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

బెల్లంపల్లి: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా చదువుకుంటున్న నిరుపేద దళిత విద్యార్థుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని బీసీ వసతి గృహం వద్ద మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఏమాత్రం పట్టింపు చేయకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిపి ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల.వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వార్టర్ల మరమ్మతులు వేగవంతం



ఆర్కే8 కాలనీ డీ 12 క్వార్టర్‌కు నిర్మించిన ప్రహరీ

శ్రీరాంపూర్: క్వార్టర్లు కూలుతున్నయ్..! అనే శీర్షిక న ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సింగరేణి అధికారులు స్పందించారు. ఏరియా పరిధిలో ఇప్పటి వరకు మరమ్మతుల కోసం వచ్చిన ద రఖాస్తులను సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్ పరిశీలించారు. కాలనీల్లో తిరుగుతూ శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను పరిశీలించారు. ఆర్కే 8కాలనీలోని డీ 12 క్వార్టర్లో కూలిన ప్రహరీ చిత్రం కథనంలో రావడంతో దాన్ని పరిశీలించి తక్షణమే ప్రహరీ నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలివ్వడంతో రెండు రోజుల్లో నిర్మించారు. ఇంకా పలు కాలనీల్లో క్షేత్ర స్థాయిలో ఉన్న రిపేర్లను సమీక్షించి త్వరగా మరమ్మతు చేయించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఎక్కడికక్కడ పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కార్మిక కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

మొరం తవ్వకాలపై నిఘా..



మొరం తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి శివారుల్లోని ప్రభుత్వ భూముల్లో గల గుట్టల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టడంతో 'మాయమవుతున్న గుట్టలు' అనే శీర్షికన ఈ నెల 12న 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. దీనిపై తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే స్పందించారు. మంగళవారం ఆర్ఐ భూమన్నతో కలిసి రెబ్బనపల్లి గుట్టల్లో మొరం తవ్వకాలు జరిపిన ప్రదేశాలను పరిశీలించారు. అక్రమంగా మొరం తరలించకుండా పటిష్ట నిఘా పెట్టాలని, ఇందుకోసం జీపీవోలు, రెవెన్యూ సిబ్బంది అంతా అందుబాటులో ఉండి ఓ కన్నేసి ఉంచాలని, అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టకుండా, తరలించకుండా చూడాలని సూచించారు. రెబ్బనపల్లి గుట్టలతో పాటుగా గూడెం గుట్ట ల నుంచి కూడా మొరం తవ్వకాలు జరగకుండా నిఘా పెట్టి అక్రమ మొరం తవ్వకాలను అరికట్టాలన్నారు.

పార్టీ అభివృద్ధికి పాటు పడండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



రాంచందర్ రావును సన్మానిస్తున్న నాయకులు

భీమారం: పార్టీ అభివృద్ధి కోసం మరింత పాటుపడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఏట మధుకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి వెళ్లిన బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావుకు తిరుగు ప్రయాణంలో భీమారం మండల కేంద్రం మండల పార్టీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ నేతృత్వంలో స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

రహదారి పనులు వేగవంతం చేయాలి



ఆర్డీవో కార్యాలయంలో రహదారి విస్తరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలటౌన్: జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాల్లో అవార్డుల జారీ ప్రక్రియను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణలో ప్రభావిత గ్రామాల్లో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను త్వరగా పరిశీలించాలన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్

పాతమంచిర్యాల: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16, 17 తేదీల్లో ఎంఈవో కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సంకె రవి, చల్లూరీ దేవదాస్, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం డి రఫియా, జిల్లా కమిటీ సభ్యులు వరలక్ష్మి, తార, అరుణ, రభియా, ఓదెమ్మ, దుర్గక్క, గట్టక్క, సవిత, పుష్ప, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పోస్టుల భర్తీకి 18న ఇంటర్వ్యూలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలోని ఆసుపత్రుల్లో ఒప్పంద సేవల పద్ధతిన పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డాక్టర్ ఎం.కోటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు(2 జనరల్ మెడిసిన్, 1 గైనకాలజిస్టు, 2 అనస్తీషియాలజీ, 1పల్మనరీ మెడిసిన్, 2 పీడియాట్రిక్) పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎంబీబీఎస్‌తో పాటు, సంబంధిత స్పెషాలిటీలో డిగ్రీ/డిప్లొమా కలిగి ఉండి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో నమోదు కాబడి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎఫ్–24లో గల జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలన్నారు.

ఓట్‌చోరీపై సంతకాల సేకరణ

జన్నారం: ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రోటిగూడలో బీజేపీ దేశంలో ఏ విధంగా ఓటు చోరీ చేస్తుందో యువతకు, ప్రజలకు వివరించి అనంతరం సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు సోహైల్ షా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి గణేష్, రొటీగూడ కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లిలో వైద్యశిబిరం

భీమారం: జైపూర్ మండలం మిట్టపల్లిలో మంగళవారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 150మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరం ఆయిన వారికి షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెత్త తొలగించారు..!



గాయత్రినగర్ వద్ద చెత్త తొలగిస్తున్న సిబ్బంది

నస్పూర్: 'ఎక్కడి చెత్త అక్కడే' అనే శీర్షికన ఈ నెల 13న ప్రచురితమైన కథనానికి మున్సి పల్ అధికారులు స్పందించారు. జాతీయ రహదారి వెంట పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సిబ్బందితో మంగళవారం తొలగింపజేశారు. దీంతో పలువురు పట్టణ ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ అధికారుల 'పొలంబాట'



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

లక్సెట్టిపేట: రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించేందుకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలో వెంకటపూర్‌లో పొలంబాట నిర్వహించారు. వంగిన విద్యుత్‌స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, లూజ్ లైన్లు సరిచేశారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు నర్సింగరావు, రవి కుమార్, సతీశ్, రాజశేఖర్, స్థానిక విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



సాయిప్రదీప్

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి స్థానిక మోడల్‌స్కూల్ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ ఫస్ట్‌ఇయర్ చదువుతున్న సాయి ప్రదీప్ ఈ నెల15 నుంచి 17వరకు రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న అభినందించారు.

రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: రతన్‌టాటా మొదటి వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో మంగళవారం టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సిబ్బంది రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 30మంది రక్తదానం చేయగా, రతన్ టాటా సేవా మార్గాన్ని కొనసాగిస్తామని బ్రాంచ్ మేనేజర్ టి.మనోహర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, వైద్యుడు ప్రేమ్‌సాయి, ప్రేమ్‌కుమార్ సింగ్, సిబ్బంది శ్రీనివాస్, లావణ్య, హరీశ్, టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ సిబ్బంది సాయికృష్ణ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

బెల్లంపల్లి: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఐదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో బుధవారం మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, రంజిత్‌కుమార్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాకూబ్, బెల్లంపల్లి మండల సీఐటీయూ కన్వీనర్ సీ.హెచ్.దేవదాస్, శ్రేణులు సమ్మక్క, భగత్, సుమన్, కమల్, ప్రభాకర్, రాజమొగిలి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు హెపటైటిస్ వ్యాక్సిన్



హెపటైటిస్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం వైద్య విద్యార్థులకు హెపటైటిస్ వ్యాక్సిన్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేశారు. అనంతరం సీపీఆర్‌పైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.అనిత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు వచ్చిన వారిని కాపాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ సులేమాన్, డాక్టర్ రేఖ, డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: విజయ్ ప్రశాంత్ - 9440208447
చెన్నూర్: తిరుపతి, ACO - 7997958206
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899